

ఏఎస్ఐ శ్యామలను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

క్రీడల్లో సత్తా చాటుతున్న పోలీస్

● ఏఎస్ఐ శ్యామలను అభినందించిన సీఎం

యూసుఫ్‌గూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీస్ విధులు నిర్వహిస్తూనే క్రీడలలో రాణిస్తూ పాన్ అమెరికా మాస్టర్ గేమ్‌లో పతకం సాధించిన ఏఎస్ఐ వి.శ్యామలను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. సైఫాబాద్ ట్రాఫిక్ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వేసపోగు శ్యామల పలు సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనడంతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు. ఈ క్రమంలో ఆమెకు 23 పోలీస్ పతకాలు, సావిత్రిబాయ్ పూలే అవార్డు, అంబేడ్కర్ అవార్డు, రెండు జాతీయ అవార్డులు, 60 రోజుల ఒంటిరి మహిళా పెట్రోలింగ్ ప్రశంస తదితర విజయాలు సాధించారు. ఇటీవల అమెరికాలోని క్లైవ్‌ల్యాండ్‌లో నిర్వహించిన పాన్ అమెరికా మాస్టర్ గేమ్స్‌లో పాల్గొని షాట్‌పుట్‌లో బ్రాంజ్‌మెడల్ సాధించారు. ఈ నేపథ్యంలో తాను సాధించిన పతకాలతో సీఎంను కలవగా ఆయన అభినందించి సత్కరించారు.

రేపు ఎన్టీఆర్ గార్డెన్స్‌లో సదర్ సమ్మేళనం

ఎర్రగడ్డ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న సదర్ సమ్మేళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎర్రగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏ.యాదగిరి, కె.యాదయ్య కోరారు. ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు ఎన్టీఆర్ గార్డెన్స్‌లో కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్, బీహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వియాదవ్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా స్వాధీనం

ఖైరతాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా గోడౌన్‌పై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చింతలబస్తీ రోడ్డులోని మొగల్ ఇమామి మెన్షన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన టపాకాయల గోదాంలో సోదాలు చేశారు. నిర్వాహకుడు మెహదీపట్నం మొరాద్ నగర్‌కు చెందిన జి.శ్రీరాంను అదుపులోకి తీసుకొని విచారించగా అనుమతి లేకుండా అక్రమంగా టపాకాయలను ఉంచేందుకు కాంప్లెక్స్‌లోని ఫ్లాట్‌ను వినియోగించినట్లు గుర్తించారు. రూ.5 లక్షల విలువ చేసే టపాకాయలను స్వాధీనం చేసుకుని సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు.

చోరీకి యత్నించిన గుర్తుతెలియని వ్యక్తులపై కేసు

బంజారాహిల్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి ఆవరణలోకి ప్రవేశించి చోరీకి యత్నించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ లోటస్‌పాండ్‌లోని సంఘమిత్ర పెరివార్ ఆర్కిటెక్చర్ ఇంటి ఆవరణలోకి ఈ నెల 22న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి ఆయన వాహనాన్ని ఫొటోలు తీశారు. అనంతరం చోరీ చేసేందుకు ఇంట్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా అలికిడి కావడంతో పారిపోయారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు కావడంతో సంఘమిత్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవపడి చిరు వ్యాపారి అదృశ్యం

బోరబండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీదర్ నుంచి వచ్చి స్వరాజ్ నగర్‌లో నివాసం ఉంటున్న అమృత్(27) మిర్చి బండి వ్యాపారం చేస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం రాత్రి ఇంటికి వెళ్లగా భార్యతో ఘర్షణ జరగడంతో అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో శుక్రవారం బోరబండ పోలీసులకు భార్య కల్పన ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి

బోరబండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్మికనగర్‌కు చెందిన ఎండీ ఇతిహాస్(20) వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. ఇంట్లో గ్యార్వీ పండుగ ఉన్నందున మేకను కొన్నారు. దానికి మేత తీసుకురావడానికి సమీపంలోని చెట్టు ఎక్కి కొమ్మలు తెంపుతున్న క్రమంలో కరెంట్ షాక్ తగిలి కిందపడ్డాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధి పథంలో గౌతమ్‌పురికాలనీ

● దశాబ్దాల క్రితమే అన్ని రకాల సౌకర్యాలు
● పార్కులో పచ్చదనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం

ఎర్రగడ్డ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్‌లోని గౌతమ్‌పురి కాలనీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ఇప్పటివరకు కొనసాగిన, ప్రస్తుతం కొనసాగుతున్న కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల కృషి ఫలితంగా కాలనీలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. సుమారు 45 సంవత్సరాల క్రితం ఏర్పడిన గౌతమ్‌పురి కాలనీ ప్రస్తుతం అభివృద్ధి చెందిన కాలనీల జాబితాలో చేరింది. కాలనీ ఏర్పడ్డ నాటి నుంచి అన్ని రకాల మౌలికవసతులు కల్పించారు. కాలనీ అభివృద్ధికి సంక్షేమ సంఘం నాయకులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం కృషి చేయడంతో తమకు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని కాలనీ వాసులు చెబుతున్నారు.

గతంలోనే అన్ని సౌకర్యాలు..

కాలనీ ఏర్పడిన 10 సంవత్సరాలకే అంతర్గత రోడ్ల నిర్మాణాలు జరిగాయి. అప్పటి ప్రజాప్రతినిధులు కాలనీ అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఎంపీలు బండారు దత్తాత్రేయ, అంజన్‌కుమార్ యాదవ్, దివంగత నేత పి.జనార్దన్‌రెడ్డి హయాంలో కాలనీలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. ఇటీవలి కాలంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సహకారంతో కాలనీలో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటుచేసుకున్నారు. కాలనీలో 40 ఫీట్ల రోడ్డు ప్రాంతంలో ఉన్న పార్క్ పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. పచ్చదనం కోసం సంక్షేమ సంఘం సభ్యులు మొక్కలను నాటుతూ ప్రతిరోజు నీరు అదేలా కృషిచేస్తున్నారు. దీంతో పార్కులో సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుతోంది. పార్క్‌లో వాకింగ్ ట్రాక్ కూడా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. చిన్నపిల్లల ఆట వస్తువులు, బల్లలు ఉండడం వల్ల సాయంత్రం వేళల్లో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కాలనీలో ఉన్న మొత్తం 50 ప్లాట్లలో 4 అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. విశాలమైన రోడ్లు, పార్క్, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం, తాగునీటి పైపులైన్లు ఉండడంతో కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటోంది.



గౌతమ్‌పురి కాలనీలో పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉన్న పార్కు

ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



గౌతమ్‌పురి కాలనీలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తున్నాం. ఇప్పటికే కాలనీలోని పార్కు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు విషయంలో ఎలాంటి సమస్యలు లేవు. కాలనీ ప్రధాన రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయి. వాటికి ఫెన్సింగ్ లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు చొరవ తీసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.

\- హెచ్.సుబ్రహ్మణ్యరావు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఆహ్లాదకరమైన వాతావరణం అందుతోంది



కాలనీ ప్రజలకు పచ్చదనంతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం అందుతోంది. చిన్నారులు, వృద్ధులు పార్క్‌లోని అందాలను ఆస్వాదిస్తున్నారు. పార్క్‌ను పచ్చదనంగా ఉంచడానికి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయం. చిన్నచిన్న సమస్యలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టిసారిస్తే కాలనీ వాసులు అన్ని రకాల సౌకర్యాలతో మంచి వాతావరణంలో నివసించేందుకు అవకాశం ఉంటుంది.

\- జి.సంతోష్‌బాబు, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి



అధికారులతో సమావేశమైన జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

జోనల్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు

ఖైరతాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ మున్సిపల్ జోనల్ కార్యాలయంలో శుక్రవారం కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. ఇందులో జీహెచ్ఎంసీకి సంబంధించిన అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండేలా జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఉత్తర్వులిచ్చారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఏ సమస్యనైనా స్వీకరించి ఆయా సర్కిళ్లకు, అధికారులకు చేరవేస్తారని అధికారులు తెలిపారు. కాగా, గతంలో జూన్ మాసంలో ఏర్పాటైన కంట్రోల్‌రూంకు సైతం సిబ్బందిని ఏర్పాటు చేసినా ఆశించిన స్థాయిలో పని జరగలేదని పలువురు వాపోతున్నారు. ఈసారైనా పకడ్బందీగా పనిచేసేలా ఉన్నతాధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారు.

శ్మశాన వాటికల్లో వసతులు కల్పించాలి

బంజారాహిల్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకొని శ్మశాన వాటికల్లో కనీస వసతులు కల్పించాలని కోరుతూ వెంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి శుక్రవారం జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని శ్మశాన వాటికల్లో చెట్లు, పొదలు పెరిగిపోవడంతో చిన్నపాటి అడవిని తలపిస్తున్నాయన్నారు. వెంటనే చెట్లను తొలగించి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరినట్లు ఆమె వెల్లడించారు. సమస్యను పరిష్కరిస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

'రంజని' పురస్కారాల ప్రదానం

ఖైరతాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చరిత్ర పునర్నిర్మాణంలో అధికారిక సమాచారం ఇచ్చే ఏజీ కార్యాలయం తన పరిశోధనలకు ఎంతో ఉపయుక్తమైనదని కాళోజీ తెలుగు విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య నిత్యానందరావు అన్నారు. రంజని తెలుగు సాహితీ సమితి దసరా దీపావళి సంచిక ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఏజీ కార్యాలయం ఆవరణలోని రంగస్థల వేదిక వద్ద జరిగింది. ఈ సందర్భంగా పాలకోడేటి సత్యనారాయణ రావు, పీఎస్ఎం లక్ష్మిలకు రంజని జీవన సాఫల్య పురస్కారాలను నిత్యానందరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజని పట్ల తనకు అపారమైన అభిమానం ఉందన్నారు. పురస్కార గ్రహీత సత్యనారాయణ మాట్లాడుతూ.. ఏజీ కార్యాలయం తనకు పుట్టినిల్లు అని, తాను జీవితమంతా రాస్తూనే ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ జనరల్ మాధవి, పూర్వ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్స్ ఎన్.సుధీర్‌కుమార్, మల్లాది సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



రచయిత్రి లక్ష్మికి పురస్కారం అందజేస్తున్న ఆచార్య నిత్యానందరావు తదితరులు

అనుమతి లేని హారన్లపై స్పెషల్ డ్రైవ్

● 24 కేసులు నమోదు

ఖైరతాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా కార్లలో వినియోగిస్తున్న మల్టీ టోన్డ్ హారన్లు, అనుమతి లేని సైరన్లపై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన డ్రైవ్‌లో ట్రాఫిక్ అదనపు డీసీపీ మహ్మద్ మాజీద్ తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో మల్టీ టోన్డ్ హారన్లు వినియోగిస్తున్న 12 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అనుమతి లేకుండా కార్లకు సైరన్ వినియోగిస్తున్న మరో 12 మందిపై సైతం కేసులు నమోదు చేసి వాటిని తొలగించామని సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపారు. ఎస్ఐ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హారన్లపై స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ అదనపు డీసీపీ మహ్మద్ మాజీద్, ఇన్‌స్పెక్టర్ ఆనంద్

దిష్టి పేరుతో రూ.70 వేలు కొట్టేశారు

● ఇద్దరు మహిళల అరెస్ట్

బంజారాహిల్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటికి నరదిష్టి తగిలిందని, పూజలు చేస్తానని నమ్మించి డబ్బుతో ఉడాయించిన ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 7కు చెందిన కరుణ గత ఫిబ్రవరి 9న ఆమె ఇంట్లో ఉన్న సమయంలో ఇద్దరు మహిళలు వచ్చి నరదిష్టి పేరుతో వారు మాటలు కలిపారు. వారి సూచన మేరకు ఓ వస్త్రంలో నిమ్మకాయలు, మిరపకాయలు, రూ.70 వేలు ఉంచగా కాసేపు పూజలు నిర్వహించినట్టు నటించి డబ్బు ఉన్న మూటను మరుసటి రోజు విప్పాలని చెప్పి వెళ్లిపోయారు. కరుణ మూట విప్పి చూడగా అందులో డబ్బు కనిపించకపోవడంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిజామాబాద్‌కు చెందిన శారదకల్ల కవిత అలియాస్ రసూరి కవిత, కోడపల్లి మాధవి నిందితులని తేలింది. ఈ నెల 24న వారు అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. కాగా, నిందితులపై గతంలో జూబ్లీహిల్స్, పంజాగుట్టలో, మాదాపూర్, ముషీరాబాద్, చిక్కడపల్లి, నారాయణగూడ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



శారదకల్ల కవిత



కోడపల్లి మాధవి

చాట్ పండుగకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): చాట్ పండుగ సందర్భంగా ప్రయాణికుల డిమాండ్ మేరకు వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. నవంబర్ 2, 9 తేదీల్లో చాప్రా-యశ్వంత్‌పూర్ (05185), 4, 11తేదీల్లో యశ్వంత్‌పూర్-చాప్రా (05186), 3న ఎస్ఎంవీటి బెంగళూరు-ధనపూర్ (06235), 9న ధనపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు (06236) రైళ్లను నడుపుతున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, నిర్వహణ కారణాలతో అక్టోబర్ 26న సికింద్రాబాద్-గూడూరు (12710), 27న గూడూరు- సికింద్రాబాద్ (12709) రైళ్లను రద్దు చేసినట్టు తెలిపారు.

క్యారమ్స్‌లో ఆదిత్య ముందంజ

హైదరాబాద్: సీబీఆర్ ప్రసాద్ తెలంగాణ స్టేట్ సీనియర్ ఓపెన్ ర్యాంకింగ్ క్యారమ్స్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన ఎస్. ఆదిత్య ముందంజ వేశాడు. శుక్రవారం గొల్లూరులోని సీబీఆర్ ఇండోర్ స్పోర్ట్స్ హాల్‌లో జరిగిన ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్‌లో హనుమంతు (మెదక్)పై ఆదిత్య వరుస గేముల్లో గెలిచాడు. ఇతర మ్యాచుల్లో వీఎస్‌కే నాయుడు, జగన్, నందుకుమార్, సాయిఈశ్వర్, సాగర్, శివప్రసాద్, రవీందర్‌గౌడ్, శివానందరెడ్డి, విక్రమ్‌కుమార్, నితిన్‌గౌడ్ ప్రత్యర్థులను ఓడించారు.



చెస్ ఆడుతున్న దృశ్యం



ఓ హోటల్‌లో అపరిశుభ్రంగా ఉన్న కిచెన్

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లోని హోటళ్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఏజీ కాలనీలోని మహ్మదీయ షవర్మలో చికెన్ గ్రిల్‌పై దుమ్ము పడేలా ఉందని, గాలికి ఉంచడంతో కలుషితమయ్యే అవకాశముందని గుర్తించారు. ఆయిల్ ఎక్కువసార్లు వినియోగిస్తున్నట్టు, ఫ్లోరింగ్‌లో ఉన్న పగుళ్ల నుంచి ఎలుకలు వచ్చే అవకాశముందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. యూసుఫ్‌గూడ రాజీవ్‌నగర్‌లోని ఆల్‌ఖాసీమ్ ది మండి హౌస్‌లో ఫ్లోరింగ్, ఫ్రీజర్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయని, పాత్రలు శుభ్రపరచలేదని, కొన్ని ఆహార పదార్థాలు నేరుగా ఫ్లోర్‌పై ఉంచినట్టు గుర్తించారు. యూసుఫ్‌గూడలోని ఆల్‌మటమ్ ఆల్ మదీనా మండి కిచెన్‌లో మైక్రో ఓవెన్, ఇతర పరికరాలు క్లీన్ చేయడం లేదని, సిబ్బంది హెడ్ క్యాప్‌లు, గ్లోవ్స్ వినియోగించడం లేదని గుర్తించారు. యూసుఫ్‌గూడలోని ఆల్‌మటమ్ ఆల్‌హింద్ అరేబియన్ మండిలో అపరిశుభ్రంగా కిచెన్, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు క్లీన్ చేయలేదని, రా మెటీరియల్‌ను ప్రమాణాల ప్రకారం నిల్వ చేయలేదని గుర్తించారు.

'స్వదేశీ మేళా'

సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది

● త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

ఖైరతాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ మేళా మన సాంస్కృతిక వారసత్వం, స్వదేశీ నైపుణ్యాలను ప్రతిబింబిస్తుందని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. పీవీ నర్సింహారావు మార్గ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో స్వదేశీ జాగరణ్ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్‌ల ఆధ్వర్యంలో జరుగుతున్న స్వదేశీ మేళాను ఆయన సందర్శించారు. ప్రదర్శనలో స్టాళ్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాబ్ మేళాలో దాదాపు 16వేల మందికి పైగా పాల్గొనగా ఎంపికైన 3వేల మందికి ఇంద్రసేనారెడ్డి ఆఫర్ లెటర్లను అందించారు. దాదాపు 4500 మంది రెండవ రౌండ్‌కు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ కన్వీనర్ హరీష్‌బాబు, గంగోత్రి డెవలపర్స్ ఛైర్మన్ మధురాంరెడ్డి, ప్రతినిధులు ఇంద్రసేన్‌రెడ్డి, సిద్దుల అశోక్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



స్వదేశీ మేళాలో మాట్లాడుతున్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి తదితరులు

ఆరోగ్యానికి సమయం కేటాయించాలి

● ఎన్ఎస్ఎస్ఓ డిప్యూటీ డైరెక్టర్ సతీష్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం కోసం రోజులో కోసం కొంత సమయం కేటాయించాలని ఎన్ఎస్ఎస్ఓ (ఎఫ్ఓడీ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి.సతీష్ అన్నారు. సంజీవయ్య పార్కు నుంచి నెక్లెస్‌రోడ్ వరకు శుక్రవారం నిర్వహించిన ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యం కోసం రోజూ కొంత సమయం కేటాయిస్తే మానసిక ప్రశాంతతో పాటు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందొచ్చన్నారు. డిప్యూటీ డైరెక్టర్ డి.శివపార్వతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రోజు కనీసం 30 నిమిషాల సమయం ఆరోగ్యం కోసం కేటాయించాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ జయరాం, నోడల్ ఆఫీసర్ భరత్‌రాజ్, ఎఓ ఇన్‌చార్జిలు గురుస్వామి, రమేష్, విజయ, ప్రమోద్, గణంకశాఖ అధికారులు పాల్గొన్నారు.



ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 5.0ను ప్రారంభించిన ఎన్ఎస్ఎస్ఓ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి.సతీష్

స్వీట్లు కొంటున్నారా..!

● శుభ్రత, నిబంధనలు పాటించని నిర్వాహకులు
● పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళికి స్వీట్లు కొనాలనుకుంటున్నారా..? అయితే జాగ్రత్త. మిఠాయి దుకాణాల్లోనూ నాణ్యమైన పదార్థాలు అందుబాటులో ఉండడం లేదు. రెండు రోజులపాటు అమీర్‌పేటలోని పలు స్వీట్ షాపుల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు పలు దుకాణాల్లో అపరిశుభ్ర వాతావరణం ఉందని, ప్రమాణాలు పాటించకుండా ఆహార పదార్థాలు నిల్వ చేస్తున్నారని గుర్తించారు. దీపావళి నేపథ్యంలో స్వీట్ల కొనుగోలు ఎక్కువగా ఉంటుందని భావిస్తున్న కొందరు దుకాణాల యజమానులు గడువు ముగిసిన వస్తువులనూ తయారీలో వినియోగిస్తున్నారు.

అమీర్‌పేటలోని ఈ దుకాణాల్లో..

● ఢిల్లీ మిఠాయివాలా దుకాణంలో ఎలుకల విసర్జితాలను గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్, సిబ్బందికి మెడికల్ సర్టిఫికెట్లు లేవు.

● ఆగ్రా స్వీట్స్‌లో ఉడికించిన పదార్థాలను మూసి ఉంచకుండా నిల్వ చేశారు. సిబ్బందికి హెడ్ క్యాప్స్, గ్లోవ్స్ లేవు. గడువు ముగిసిన చుడువా ప్యాకెట్లు-6, ముర్మురాల ప్యాకెట్లు-7 గుర్తించారు.

● వినూత్న ఫుడ్స్‌లో పెస్ట్ కంట్రోల్ రికార్డులు లేవు. ఆహార పదార్థాల నిల్వకు సరైన ఏర్పాట్లు చేయలేదు. గడువు ముగిసిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ వినియోగిస్తున్నారు. సిబ్బందికి హెడ్ క్యాప్స్, గ్లోవ్స్ లేవు.

● వాసిరెడ్డి ఫుడ్స్‌లో ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ లేదు. హెడ్ క్యాప్, గ్లోవ్స్ లేవు. లేబుల్ లేని పచ్చళ్లు విక్రయిస్తున్నట్టు గుర్తించారు.




ఓ దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

సీఎం స్నేహితుడు మా భూమిని కబ్జా చేశాడు

● సీఎం రేవంత్ జోక్యం చేసుకోవాలని బాధితుల విన్నపం
● నిందితులకు పోలీసులు సహకరిస్తున్నారని ఆరోపణ

ఖైరతాబాద్/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కబ్జాదారులకు పోలీసులు అండగా ఉండి వేధింపులకు పాల్పడుతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని తమ భూమి తమకు అప్పగించాలని బాధితులు వేడుకున్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఆయన కుమారుడు రాకేష్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్ శేఖర్‌రెడ్డి, బాధితులు ఎస్.అరుణాదేవి, ఎస్.కృష్ణ మాట్లాడారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తిరుమలగిరిలోని సర్వే నెంబర్లు 398, 399, 409, 410, 411/1, 411/2, 579లోని మొత్తం 19.18 ఎకరాల భూమిని తాము 1968లో కొనుగోలు చేశామని బాధితులు తెలిపారు. అయితే కొంతకాలం క్రితం సీఎం స్నేహితుడు తమ భూమిని కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ దాదాపు 100 మంది ఆయుధాలతో తమ స్థలంలో ఉన్నారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి రెండు సార్లు మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేసిన సూర్యనారాయణ రెడ్డి సైతం బాధితుడిగా మారినట్లు వారు తెలిపారు. రాచకొండ సీపీని కలవగా తమనే బెదిరించారని, హన్మంతరావు ద్వారా సీఎం రేవంత్ బ్రదర్స్‌ను కలవాలని చెప్పారని ఆరోపించారు. ఈ విషయంపై డీజీపీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు.



పెద్ద ఫొటోలు చూపిస్తున్న బాధితులు

తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు

ఈ విషయంపై దర్యాప్తు నడుస్తోందని.. ఈ క్రమంలో కొందరు నిరాధారమైన కథనాలు, వీడియోలు పోస్ట్ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాక, పోలీసులపై, ప్రభుత్వ పెద్దలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రాచకొండ పోలీసులు చెబుతున్నారు. ఈ విషయంలో పోలీసులకు, ప్రభుత్వ పెద్దలకు ఎలాంటి సంబంధం లేదని, తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

అంబేడ్కర్ యూనివర్సిటీలో నిరసనలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో పది ఎకరాల స్థలాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జె.ఎన్.ఎ.ఎఫ్.ఎ.యూ) కేటాయించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు జూబ్లీహిల్స్ వర్సిటీ ఆవరణలో రెండో రోజు శుక్రవారం వర్సిటీ ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. అధ్యాపక, అధ్యాపకతేర, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోషియేషన్, టైంస్కేల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనం ఎదుట అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఛైర్‌పర్సన్ ప్రొ.పలవి కాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ మహేష్‌గౌడ్, జేఏసీ నేతలు డా.యాకేష్ దైద, కాంతం ప్రేంకుమార్, ప్రొ.పుష్పాచక్రపాణి, ఆనంద్‌పవర్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ వర్సిటీలో నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు, ఉద్యోగులు



ప్రసంగిస్తున్న గరికపాటి నరసింహారావు

భారతం చరిత్ర.. రామాయణం కావ్యం

చిలకలగూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, లలిత కళాసమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్ నిలయంలో పద్మశ్రీ గరికపాటి నరసింహారావుచే మహాభారతంలో ధర్మరాజు పాత్ర ఔచిత్యం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. రాగ, భావ యుక్తంగా పద్యాలు, శ్లోకాలు గానం చేస్తూ ప్రవచనం ఆకట్టుకుంది. జీవితంలో క్లిష్టమైన సమస్యలు ఎదుర్కొన్న తీరు, పుట్టుక ప్రత్యేకత, ధర్మానికి కట్టుబడి ఉండటం, యక్ష ప్రశ్నలు, అరణ్య పర్వం ఘట్టాలు చమత్కాలతో వివరించారు. సమితి ఉపాధ్యక్షుడు రవి పి.పాడి 56 సంవత్సరాలుగా సమితి చేపట్టిన కార్యక్రమాల ప్రగతి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జనరల్ మేనేజర్ రామకృష్ణ, సమితి మాజీ అధ్యక్షుడు గణేశ్వర రావు, మంత్రి భుజంగ రావు, గోవింద్, షేక్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తల అదృశ్యం



అమరేందర్



చిన్నాల సవిత

అడ్డగుట్ట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో భార్యాభర్తలు అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వారాసిగూడ బాపూజీనగర్ ప్రాంతానికి చెందిన చిన్నాల అమరేందర్, సవిత దంపతులు. వారిది చిట్టీల వ్యాపారం. ఈనెల 14 నుంచి వారు ఇంటి నుంచి కనిపించకుండాపోయారని అమరేందర్ సోదరుడు శుక్రవారం వారాసిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చిట్టీల వ్యాపారంలో నష్టం వచ్చినందుకు బాధితులు ఇంటికి వస్తున్నారన్న నెపంతోనే అదృశ్యమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇద్దరి సెల్‌ఫోన్‌లు ప్రస్తుతం స్విచ్ ఆఫ్ చేసి ఉన్నాయని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దంపతుల అదృశ్యం వెనుక కారణాలేమిటో పోలీసులు ఆరా తీస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

మారేడుపల్లి అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కుటుంబ అంతర్గత సమస్యలతో మనస్తాపానికి గురై ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోర్ట్ ఉత్తరాయ ప్రాంతానికి చెందిన పి.మోహన్(24) శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో ఇనుప రాడ్డుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి కార్ఖానా పోలీసులు చేరుకున్నారు. కుటుంబ సమస్యలతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కార్ఖానా పోలీసులు అభిప్రాయపడుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చాట్ పండుగకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చాట్ పండుగ సందర్భంగా ప్రయాణికుల డిమాండ్ మేరకు వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. నవంబర్ 2, 9 తేదీల్లో చాప్రా-యశ్వంత్‌పూర్ (05185), 4, 11తేదీల్లో యశ్వంత్‌పూర్-చాప్రా (05186), 3న ఎస్ఎంవీటీ బెంగళూరు-ధనపూర్ (06235), 9న ధనపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు (06236) రైళ్లను నడుపుతున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, నిర్వహణ కారణాలతో అక్టోబరు 26న సికింద్రాబాద్-గూడూరు (12710), 27న గూడూరు- సికింద్రాబాద్ (12709) రైళ్లను రద్దు చేసినట్టు తెలిపారు.



కళాకారుల నాట్య ప్రదర్శన

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

మాదాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో గీతికా కూచిపూడి డాన్స్ అకాడమి నాట్య గురువులు లక్ష్మి అనంత కృష్ణ శిష్యబృందం కూచిపూడి ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విఘ్నరాజం భజే, గణేశా స్తుతి, గణేశాకౌతం, అన్నమాచార్య కీర్తనలు, జతిస్వరం, తదితర అంశాలపై చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

అసిస్టెంట్ ప్రొ.విజయలక్ష్మికి గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు

బర్కత్‌పుర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పురలోని రెడ్డి కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.విజయలక్ష్మికి మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు 2024 ప్రదానం చేశారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, సుప్రీంకోర్టు న్యాయవాది డి.ఎల్.పాండు చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం అందుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, ప్రొఫెసర్ జి.సుదర్శన్‌రెడ్డి, తదితరులు విజయలక్ష్మిని అభినందించారు.

సమస్యలకు కేరాఫ్ పిట్టల బస్తీ

● మౌలిక సదుపాయాలు లేక అల్లాడుతున్న ప్రజలు ● అరవై ఏండ్లయినా మారని లాల్‌బజార్ వాసుల జీవనస్థితి



పిట్టల బస్తీ

తిరుమలగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ విశ్వ నగరంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఇంకా బస్తీలు అభివృద్ధి చెందక పోవడం సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మురికివాడల్లో ఇప్పటికీ మౌలిక వసతులు లేక ప్రజలు అల్లాడుతున్నారు. ప్రభుత్వాలు మారినా తమ తలరాతలు మారడం లేదంటూ మురికివాడ ప్రజలు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. తిరుమలగిరి మండల పరిధిలోని లాల్‌బజార్ పిట్టల బస్తీ.. అభివృద్ధికి ఇంకా ఎంతో దూరంలో ఉంది. సుమారు 60 ఏళ్ల క్రితం మల్కాజ్‌గిరి ఉప్పర్‌గూడ రాజు కాలనీ నుంచి పిట్టల సామాజిక వర్గానికి చెందిన వాళ్ల వలస వచ్చి లాల్‌బజార్ ప్రాంతంలో చిన్న చిన్న గుడిసెలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత తమ తలరాతలు మారుతాయని వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తారని ఆశపడ్డారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తమ పరిస్థితి ఉన్నట్లు పిట్టల బస్తీ వాసులు ఆందోళన చేస్తున్నారు. బస్తీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక తాగునీరు సరిగా సరఫరా కాకపోవడంతో కలుషిత నీరే తాగాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబుల్ బెడ్‌రూమ్‌లు కట్టించాలని మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేదని వారు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. 60 ఏళ్ల క్రితం ఉన్న పరిస్థితి ఇప్పుడు కూడా కొనసాగుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక తాగునీరు కలుషితం అవుతోంది. వాటినే వడపోసి తాగాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు గదుల ఇండ్లు నిర్మించి ఇస్తే రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ బాగు పడుతుంది.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



60 ఏళ్ల క్రితం మా అమ్మా నాన్న ఈ ప్రాంతానికి వలస వచ్చారు. అప్పుడు ఏ విధంగా ఉందో బస్తీ ప్రస్తుతం అదే విధంగా ఉంది. మౌలిక సదుపాయాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే డ్రైనేజీ పైపులు నిండి మురికి నీరు ఇళ్లల్లోకి చేరుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి డబుల్ బెడ్‌రూమ్ కట్టించాలి.

- లల్లురాం

ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలు



ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, తీగలు కిందికి వేలాడుతున్నాయి. వాటి ద్వారా ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయి. గుడిసెలను తొలగించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించడంతో పాటు రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి.

-రజిని

ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే ఊరుకోం

● ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు



ఇంటర్వ్యూ

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నార్త్ జోన్ పరిధిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా, ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించినా ఊరుకునేదిలేదని నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. నార్త్ జోన్ పరిధిలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యపై శుక్రవారం నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

నార్త్ జోన్ (మీ పరిధిలో) ఎన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు వస్తాయి ?

నార్త్‌జోన్ పరిధిలో బేగంపేట, మహాకాళి, గోపాలపురం, తిరుమలగిరి నాలుగు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి.

ఏ సమయంలో ఎక్కువగా ట్రాఫిక్ ఉంటుంది? నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఉదయం 8.30 నుండి స్కూల్స్, కాలేజీలకు వెళ్లే విద్యార్థులతో, 9 గంటల తరువాత ఆఫీసులకు వెళ్లేవారితో ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. 11.30 గంటల వరకు ఉంటుంది. సాయంత్రం 3.30 నుండి రాత్రి 9 గంటల వరకు నార్త్ జోన్ పరిధిలో అధికంగా ట్రాఫిక్ సమస్య ఉంటుంది. ఈ సమయంలో అదనపు లేన్ ద్వారా ట్రాఫిక్‌కు చెక్ పెట్టేందుకు ప్రయత్న చేస్తున్నాం.

ఫుట్ పాత్ ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసీతో కలిసి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల మోండా మార్కెట్, బేగంపేట ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాం. త్వరలో మినిస్టర్ రోడ్డులో కూడా ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నాం.

రాంగ్ రూట్, కార్లకు బ్లాక్ టింటెడ్ గ్లాస్‌లు, సైరన్‌లపై ఏం చర్యలు తీసుకుంటున్నారు ?

నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, అడిషనల్ కమిషనర్ (ట్రాఫిక్) విశ్వప్రసాద్, డీసీపీ1 (ట్రాఫిక్) రాహుల్ హెగ్డేల నిరంతర పర్యవేక్షణలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. కొన్ని ప్రాంతాల్లో యూ టర్న్‌లు దూరంగా ఉన్నాయని రాంగ్‌రూట్‌లో వెళ్లే వారిని నిలువరించేందుకు ప్రత్యేకంగా ఆయా ప్రాంతాల్లో పోలీసు అధికారులను నియమించి వారి వద్ద నుండి పెండింగ్ చలాన్లు వసూలు చేయడం వంటివి చేస్తున్నాం.



జేబీఎస్ ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్ రాజ్

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

మారేడుపల్లి అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని నార్త్ జోన్ ట్రాఫిక్ జి.శంకర్ రాజు అన్నారు. హైదరాబాద్ కమిషనర్ సి.వి.ఆనంద్, ట్రాఫిక్ అడిషనల్ సి.పి.శ్రీ విశ్వప్రసాద్ రాహుల్ హెడ్జ్ డీసీపీ ఆదేశాల మేరకు శుక్రవారం జేబీఎస్‌లోని ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు.. నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం అంటేనే సురక్షిత ప్రయాణం అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది డైవర్స్, డిప్యూటీ ఆర్ఎం‌ఓ భీంరెడ్డి, భాస్కర్ రెడ్డి, పి.ఓ.శ్రీనివాస్, కుషాయిగుడా డీఎం.మహేశ్, ఇతర సిబ్బంది, వెంకట ప్రసాద్ హెచ్.జి.అధికారి పాల్గొన్నారు.



క్యారమ్స్‌లో ఆదిత్య ముందంజ

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సీబీఆర్ ప్రసాద్ తెలంగాణ స్టేట్ సీనియర్ ఓపెన్ ర్యాంకింగ్ క్యారమ్స్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన ఎస్.ఆదిత్య ముందంజ వేశాడు. శుక్రవారం గొల్లూరులోని సీబీఆర్ ఇండోర్ స్పోర్ట్స్ హాల్‌లో జరిగిన ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్‌లో హనుమంతు (మెదక్)పై ఆదిత్య వరుస గేముల్లో గెలిచాడు. ఇతర మ్యాచుల్లో వీఎస్కే నాయుడు, జగన్, నందుకుమార్, సాయిఈశ్వర్, సాగర్, శివప్రసాద్, రవీందర్‌గౌడ్, శివానందరెడ్డి, విక్రమ్‌కుమార్, నితిన్‌గౌడ్ ప్రత్యర్థులను ఓడించారు.



కలాసిగూడ బస్తీ సంఘంవారికి అవగాహన కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది

పోస్టల్ శాఖ సేవలను వినియోగించుకోవాలి

● వంజరపు అంజనేయులు

రాంగోపాల్‌పేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలాసిగూడ బస్తీ నాయకుడు వంజరపు అంజనేయులు పిలుపునిచ్చారు. డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని కలాసిగూడ కమ్యూనిటీ హాల్‌లో పోస్టల్ శాఖ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. పోస్టల్ శాఖలో తక్కువ ప్రీమియం అధిక బోనస్‌తో ఇస్తున్న పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, చిన్నారి తల్లుల భవిష్యత్తు కోసం ఉన్న సుకన్య సమృద్ధి యోజన ప్లాన్, పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ వంటి సేవలను ఉపయోగించుకొని లాభపడాలని బస్తీవాసులకు సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ పబ్లిక్ రిలేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, డిప్యూటీ పోస్ట్ మాస్టర్ స్మిత, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ హరిచందర్, పోస్ట్ ఉమెన్ ప్రతిభతో పాటు ఇతర సిబ్బంది, బస్తీవాసులు పాల్గొన్నారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు..!

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లోని హోటళ్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఏజీ కాలనీలోని మహ్మదీయ షవర్మలో చికెన్ గ్రిల్‌పై దుమ్ము పడేలా ఉందని, గాలికి ఉంచడంతో కలుషితమయ్యే అవకాశముందని గుర్తించారు. ఆయిల్ ఎక్కువసార్లు వినియోగిస్తున్నట్లు, ఫ్లోరింగ్‌లో ఉన్న పగుళ్ల నుంచి ఎలుకలు వచ్చే అవకాశముందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. యూసుఫ్‌గూడ రాజీవ్‌నగర్‌లోని అల్‌ఖాసీమ్ ది మండి హౌస్‌లో ఫ్లోరింగ్, ఫ్రీజర్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయని, ఎగ్జాస్ట్ ఫ్యాన్ శుభ్రపర్చలేదని, స్టవ్, పాత్రలు శుభ్రపరచలేదని, కొన్ని ఆహార పదార్థాలు నేరుగా ఫ్లోర్‌పై ఉంచినట్లు గుర్తించారు. యూసుఫ్‌గూడలోని ఆల్‌మటమ్ ఆల్ మదీనా మండి కిచెన్‌లో మైక్రో ఓవెన్, ఇతర పరికరాలు క్లీన్ చేయడం లేదని, సిబ్బంది హెడ్ క్యాప్‌లు, గ్లోవ్స్ వినియోగించడం లేదని గుర్తించారు. యూసుఫ్‌గూడలోని ఆల్‌మటమ్ ఆల్ హింద్ అరేబియన్ మండిలో అపరిశుభ్రంగా కిచెన్, చిమ్నిలున్నాయని, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు క్లీన్ చేయలేదని, కిచెన్ అంతటా ఆహార వ్యర్థాలు ఉండడం, రా మెటీరియల్‌ను ప్రమాణాల ప్రకారం నిల్వ చేయలేదని గుర్తించారు.



ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు



అపరిశుభ్రంగా ఉన్న కిచెన్



ఇంటికి వెళ్లే దారిలో మెట్లు లేక మరో మహిళ సాయంతో గుట్ట ఎక్కుతున్న వృద్ధురాలు

గుట్టకు మెట్లు లేక బస్తీవాసుల పాట్లు

● అడ్డగుట్ట డి సెక్షన్‌లో వందలాది గుడిసెలు ● హైరాన పడుతున్న వృద్ధులు

అడ్డగుట్ట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట డివిజన్‌లోని అడ్డగుట్ట డి సెక్షన్‌లో ఎత్తైన గుట్ట ప్రాంతానికి మెట్లు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడ్డగుట్ట సీపీఐ కార్యాలయం పక్క నుంచి ఎత్తైన గుట్టకు వెళ్లేదారిలో కొన్ని వందల ఇండ్లు, గుడిసెలు ఉంటాయి. ప్రతి రోజు వందల మంది ఈ గుట్ట మీది నుంచి రాకపోకలు సాగిస్తారు. సీపీఐ పార్టీ కార్యాలయం నుంచి పైకి మెట్లు గాకుండా రోడ్డులా ఉండడంతో ఎక్కలేకపోతున్నారు. వృద్ధులయితే వేరే వారి సహాయంతోనే పైకి ఎక్కాల్సిన పరిస్థితి. ఇకపోతే బైకులపై వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తోంది. బైకులు ఎక్కడ జారి వెనక్కి వస్తాయోననే భయంతో వణికిపోతున్నారు. రాత్రి సమయంలో గుట్ట మీదుగా బయటికి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. గతంలో స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మికి ఎన్నోసార్లు విన్నవించినా ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మెట్లు వేయాలి

ఈ ప్రాంతంలో కొంత భాగాన్ని మట్టిని తొలగించి కొత్త మెట్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు. సీపీఐ కార్యాలయం పక్క నుంచి రెండు దారులున్నాయి. ఇదే తరహాలో ఇబ్బందులు ఉండడంతో మరో మార్గం లేకపోవడంతో ఇదే దారి శరణ్యమైపోయింది. వెంటనే ఈ ప్రాంతాన్ని రెండు వైపులా మెట్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పెట్టుబడి పేరుతో రూ. 1.45 కోట్లు కాజేశారు

● ముగ్గురిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైం పోలీసులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్‌లో పెట్టుబడుల పేరుతో నగరవాసి నుంచి రూ. 1.45 కోట్లు కాజేసిన ముగ్గురు నిందితులను సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరుకు చెందిన రామేశ్వర బెహరా(26) ఎక్స్‌టీ స్క్వేర్ పేరుతో సంస్థను స్థాపించాడు. ఈ సంస్థలో షేక్ జైనబ్ అలియాస్ నిహారిక(29) టెలీకాలర్‌గా, ఆమె భర్త అక్బర్ ఖాన్(31) మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. నగరానికి చెందిన వ్యక్తిని సంప్రదించిన వీరు ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని నమ్మించారు. ముందుగా రూ. 2 లక్షలు పెట్టుబడి పెట్టించి లాభాలు చూపారు. పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని చెప్పి పలు దఫాలుగా 2019 నుంచి 2021 వరకు రూ. 1.45 కోట్లు వసూలు చేశారు. లాభాలు కాదుకదా పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో బాధితుడు రామేశ్వర బెహరాను సంప్రదించాడు. రేపు, మాపు అంటూ కాలయాపన చేసి తప్పించుకుంటుండడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు నిందితులు రామేశ్వర బెహరా, జైనబ్ అలియాస్ నిహారిక, అక్బర్‌ఖాన్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

సైబర్ నేరగాళ్లకు ఖాతా సమకూర్చిన వ్యక్తి అరెస్ట్

సైబర్ నేరగాళ్లకు ఖాతాలు సమకూర్చి సహకరిస్తున్న వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. మహబూబాబాద్ మరిపెడకు చెందిన కారంపూడి రాజేష్ సైబర్ నేరగాళ్లకు కమీషన్‌ల కోసం ఖాతాలు సమకూర్చి సహకరిస్తున్నాడు. పెట్టుబడికి అధిక రాబడి అంటూ నగరవాసిని మోసం చేసి రూ. 19.90 లక్షలు రాజేష్ ఖాతాలో జమ చేయించారు. ఈ డబ్బుకు సరిపడా కమీషన్ తీసుకున్న రాజేష్ మిగతా డబ్బును సైబర్ నేరగాళ్ల ఖాతాలకు బదిలీ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు రాజేష్‌ను అరెస్ట్ చేశారు.

పోలీసునంటూ డబ్బు వసూలు చేసిన వ్యక్తి అరెస్ట్

అల్వాల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసునంటూ ఓ ఆటో డ్రైవర్‌ను బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని అల్వాల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అల్వాల్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రాహుల్‌దేవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 23వ తేదీన సాయంత్రం కానాజిగూడ ప్రాంతానికి చెందిన నవీన్‌నాయక్ ఆటోలో వస్తుండగా అల్వాల్ వెంకటాపురం ప్రాంతానికి చెందిన ఆర్. నరేష్(25) తనకుతాను పోలీస్‌నని చెప్పి నవీన్‌నాయక్ ఆటోను ఆపాడు. యూనిఫామ్ ధరించలేదని, సరైన పత్రాలు లేవని బెదిరించి అతని నుంచి రూ. 22 వేలు తీసుకొని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎస్.ఐ అంబికాగౌడ్ నేతృత్వంలో నరేష్‌ను శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ. 2 వేల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ అంబిక, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్స్, ఎస్‌హెచ్ వో రాహుల్‌దేవ్ అభినందించారు.

కూలీ డబ్బులు అడిగితే దొంగతనం నెపం

● మైనర్లను చితకబాదిన దుకాణం యజమానులు, సిబ్బంది



మైనర్లపై దాడి చేస్తున్న నగల దుకాణం యజమాని, సిబ్బంది

పీర్జాదిగూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పని చేయించుకున్నందుకు కూలీ డబ్బులు ఇవ్వమని అడిగిన ఇద్దరు మైనర్ బాలురను దొంగతనం నెపంతో ఓ నగల దుకాణం యజమానితో పాటు అతని దగ్గర పనిచేసే వారందరూ కలిసి చితకబాదారు. గాజు సీసాతో తీవ్రంగా గాయపరచడమే కాకుండా రక్తం వచ్చేలా కొట్టారు. బోడుప్పల్ మేయిన్ రోడ్డులో హనుమాన్‌నగర్‌లోని మంగల్ గణేష్ జువెల్లర్స్ యజమానులు దుకాణం బయట బీస్తాపీతం(16), ఫిరోజ్(14)అనే ఇద్దరు మైనర్ బాలురను చితకబాదిన సంఘటన శుక్రవారం ఉదయం జరిగింది. నగల దుకాణం ముందు మైనర్లపై జరుగుతున్న ఈ దౌర్జన్యాన్ని గమనించిన ప్రయాణీకులు సదరు దుకాణం యజమానిని మందలించి దాడిని అడ్డుకొని వారిని పోలీసులకు అప్పగించారు. అయితే ఇద్దరు మైనర్లు బంగారం దుకాణం ఉన్నటువంటి కాంప్లెక్స్‌లో వాచ్‌మెన్‌లుగా పనిచేస్తారు. దీపావళి సందర్భంగా కాంప్లెక్స్‌ను కూలి ఇచ్చి శుద్ధి చేసేందుకు మట్లాడుకున్నారు. పని పూర్తయ్యాక ఆ ఇద్దరు మైనర్లు డబ్బులు అడిగేందుకు దుకాణానికి వచ్చారు. దుకాణం యజమాని పూజ చేస్తున్న క్రమంలో డబ్బులు అడగడంపై వివాదం చెలరేగింది. దీంతో ఒక్కసారిగా దుకాణంలో పనిచేసే వారంతా కలిసి ఆ మైనర్లపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడి ఘటనను ప్రయాణీకులు తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయింది. దాడికి పాల్పడ్డ ముఖేష్‌చౌదరి, అర్జున్‌సింగ్ చౌదరి, మనీష్, గజేందర్, చెన్నారాం, రాకేష్, రాజేష్‌లతో పాటు మరికొందని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు.



ఇందిరా పార్క్ వద్ద మూసీ బాధితులకు అండగా నిర్వహించిన ధర్నాకి బీజేపీ మహాకాళి జిల్లా అధికార ప్రతినిధి శారదా మల్లేష్ ఆధ్వర్యంలో చిలకలగూడ మునిసిపల్ మైదానం నుంచి బయలు దేరిన నాయకులు, కార్యకర్తలు - (చిలకలగూడ, ఆంధ్రజ్యోతి)